క్లుప్తంగా

వేతనాలు పెంచాలి



ఎల్లారెడ్డిరూరల్: మున్సిపల్ కార్మికుల వేతనాలను పెంచాలని మున్సిపల్ కార్మికుల సీఐటీయూ సంఘం నాయకులు రాజనర్సు డిమాండ్ చేశారు. బుధవారం ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మశ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 28న రాష్ట్ర మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణహరి



కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సబ్బని కృష్ణహరిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామకపత్రం అందజేశారు. చేనేత కార్మికుల సమస్యలపై పోరాడుతున్నందుకు కృష్ణహరిని రెండోసారి రాష్ట్ర కార్యవర్గంలో కొనసాగిస్తున్నట్లు అధ్యక్షుడు పేర్కొన్నారు.

ప్రాటెక్షన్ ఏఈగా ప్రదీప్‌కుమార్



కామారెడ్డి అర్బన్: ఎన్పీడీసీఎల్ కామారెడ్డి ప్రాటెక్షన్ ఏఈగా వరయోగి ప్రదీప్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రదీప్ కుమార్ దోమకొండ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఏడీఈలు జయరాజ్, సతీష్, మల్లేష్, హన్మంత్ రెడ్డి, ఏఈలు జ్యోతి, గాయత్రి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా అశోక్ కుమార్

మాచారెడ్డి: పీఆర్‌టీయూ మాచారెడ్డి మండల శాఖ అధ్యక్షుడిగా పాత అశోక్‌కుమార్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన పీఆర్‌టీయూ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రూప్‌సింగ్, అసోసియేట్ కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యదర్శిగా సీహెచ్ శ్రీహరి, మహిళా విభాగం కార్యదర్శిగా శైలజలను ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై శక్తివంచన లేకుండా పోరాడుతానని అశోక్ పేర్కొన్నారు.

అభినందనలు



కామారెడ్డి అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మద్ది చంద్రకాంత్‌రెడ్డిని తెలంగాణ నాన్ గెజిటెగ్ ఉద్యోగుల సంఘం నాయకులు బుధవారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కేంద్ర బాధ్యులు నాగరాజు, ప్రతినిధులు దేవరాజు, సాయిలు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై దాడులు



దోమకొండ: అంబారిపేట్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని ఫిర్యాదు మేరకు బుధవారం దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావ్ తెలిపారు. తనిఖీల్లో ఎలాంటి మద్యం దొరకలేదన్నారు. అనంతరం గ్రామంలోని కల్లు దుకాణంపై దాడిచేసి కల్లు శాంపిల్ సేకరించినట్లు వివరించారు. ఎక్సైజ్ ఎస్సై అవల్దార్, సిబ్బంది బాల్‌రాజ్, స్వాతి తదితరులున్నారు.

రికవరీ ఫోన్ల అప్పగింత



కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ ఆదేశాల మేరకు బుధవారం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో ఫోన్లను పోగొట్టుకున్న వారివి రికవరీ చేసి అందజేశారు. ఫోన్లను సీఈఐఆర్ యాప్ ద్వారా వెతికి బాధితులకు అందించారు. ఇప్పటివరకు సీఈఐఆర్ యాప్ ద్వారా 120 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

వసతుల కల్పనపై పట్టింపేదీ?

- అపరిశుభ్ర వాతావరణంలోనే వారి జీవనం
- క్రిమికీటకాలతో సావాసం
- ఇబ్బందులు పడుతున్న దుబ్బవాసులు



గుడిసెల మధ్య నుంచే పారుతున్న మురికికాలువ



రాజారాందుబ్బలో పూరి గుడిసెల్లో నివసిస్తున్న జనం

బాన్సువాడ: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వాలు అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నా రాజారాందుబ్బవాసుల బతుకులు మాత్రం మారడం లేదు. మండలంలోని తాడ్కోల్ గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న రాజారాం దుబ్బాలో మౌలిక వసతులు కరువై కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్ల క్రితం బాన్సువాడ పట్టణానికి అర కిలో మీటర్ దూరంలో కాలనీ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే మున్సిపాలిటీ పరిధికి ఆనుకుని కాలనీ ఉంటుంది. అయితే వారుండే కాలనీలో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

కనీస వసతులు కరువు..

రాజాంరాందుబ్బకాలనీలో బుడిగె జంగం కులానికి చెందిన 700 మందిపైగా జీవనం సాగిస్తున్నారు. 500 మంది ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. కనీస వసతులైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. గుడిసెలు వేసుకుని క్రిమికీటకాలు, విషసర్పాలతో సావాసం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్థలాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయం వెనుక నుంచి రాజారాందుబ్బాకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం ఈ దారి గుండా వెళ్లే రైతులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని వేడుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి రాజారాందుబ్బలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

మురికికాలువలు లేవు



దుబ్బలో మురికి కాలువలు లేవు. వర్షాకాలంలో మురికి నీళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం చెప్పులరిగేలా తిరిగినా ఇవ్వలేదు. మా లాంటి గరీబోళ్లకు న్యాయం చేయరు.

– గంగవ్వ, రాజారాందుబ్బవాసి

దుర్భర జీవితం గడుపుతున్నాం



పూరి గుడిసెల్లో దుర్భర జీవితం గడుపుతున్నాం. ఇళ్ల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వర్షాకాలంలో ఇంట్లో కాలు కూడా పెట్టలేని పరిస్థితి . రాత్రివేళల్లో విషపురుగులు వస్తున్నాయి. పిల్లలతో కలిసి బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాం.

– రాణి, రాజారాందుబ్బవాసి

బుడిమి హెడ్మాస్టర్‌పై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు

బాన్సువాడ రూరల్: బుడిమి జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్‌పై గ్రామానికి చెందిన పలువురు బుధవారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో సరస్వతి పూజ విషయంలో ప్రశ్నించడానికి వెళ్లిన తమతో హెడ్మాస్టర్ వ్యంగ్యంగా మాట్లాడారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలల్లో సరస్వతి పూజ చేయాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదని, ఉంటే చూపించాలని తమ మనోభావాలను గాయపర్చారని అన్నారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ పాఠశాలకు చేరుకుని ఆ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మత విశ్వాసాలకు, సాంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, పాత పద్ధతిని కొనసాగించాలని సూచించి సమస్యను పరిష్కరించారు. హెడ్మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కామారెడ్డి డీఈవోకు సైతం ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈవో నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేస్తున్న బుడిమి గ్రామస్తులు, వెనక తహసీల్దార్ వర ప్రసాద్

మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ: నాగర్ కర్నూల్‌లో ఈ నెల 27న జరిగే మాలల ఆత్మగౌరవ సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం బాన్సువాడలో మాల మహానాడు జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాజకీయ జేఏసీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ గైని ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు దొన్కంటి వెంకటేష్, చింతల గంగాధర్, మల్లూరి సాయిలు, బండారు మైశయ్య, నర్సింలు, బాలసాయి, తదితరులున్నారు.

కూరగాయల సాగుపై అవగాహన



బాన్సువాడ రూరల్: సంగోజీపేట్‌లో పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తన రకాలు, మొలక దశలో తీసుకునే జాగ్రత్తలు, పురుగు, పేను నివారణ చర్యల గురించి తెలియజేశారు. యాజమాన్య పద్ధతులు, మైక్రో ఇరిగేషన్, డ్రిప్, స్ప్రింకర్ల, రైన్‌పంపు, మల్చింగ్ విధానాలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. సంస్థ ప్రతినిధులు రాయల భూపతి, గ్రామస్తులు బాలరాజు, సురేష్ గౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలి

- పీఠాధిపతి సోమలింగ శివాచార్య



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్వామీజీలు

ఎల్లారెడ్డి: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బిచ్కుందలోని బండాయప్ప మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్య అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో బసవేశ్వరుడి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ అనంతరం కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బసవ లింగ శివాచార్య, మల్లికార్జున శివాచార్య, సిద్ధ దయాల్ శివాచార్య, శంకర లింగ శివాచార్యులతో కలిసి బసవేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పీఠాధిపతి మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా ఐక్యం కావాలని, ప్రతి ఒక్కరు శివారాధన చేయాలని అన్నారు. మండల వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షుడు వీరప్ప, రామప్ప, ప్రవీణ్, అశోక్, రాధిక, వసంతలక్ష్మి, అనిల్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్ నీలకంఠం, తదితరులున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



తిమ్మాపూర్- నస్రుల్లాబాద్ రోడ్డు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని తిమ్మాపూర్-నస్రుల్లాబాద్ గ్రామాల మధ్య ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఓ వైపు కేబుల్ కోసం గుంతలను తవ్వారు. మరో వైపు వడ్ల కుప్పలు పేర్చడంతో రోడ్డు ప్రయాణం ప్రమాదకరంగా సాగుతుంది. దీనికి తోడు వరి కోతలు సాగడంతో హార్వెస్టర్లు తిరగడం వలన రోడ్డుపై మట్టి గడ్డలు పడటం, సమయానికి చిరు జలులు కురవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీనితో ద్విచక్ర వాహనదారులు నిత్యం గాయాల పాలవుతున్నారు.

సమాచారం..

నేడు లింగంపేట బంద్

లింగంపేట(ఎల్లారెడ్డి): హిందూ దేవాలయాలపై దాడులను అరికట్టాలని నిరసిస్తూ గురువారం లింగంపేట బంద్ పాటించాలని హిందూ సంఘాల ఐక్య వేదిక నేతలు పిలుపునిచ్చారు. గురువారం లింగంపేటలోని వ్యాపార, దుకాణ సముదాయాలు, హోటళ్లు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు.

మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య అధ్యక్షులు యశోదబాయి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలపై చర్చిస్తారన్నారు. గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛందంగా బంద్



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు



మహమ్మద్‌నగర్‌లో మూసి ఉన్న దుకాణ సముదాయాలు



ఎల్లారెడ్డిలో ..

నిజాంసాగర్(జుక్కల్): హిందూ దేవాలయాలపై దాడులకు నిరసనగా బుధవారం నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండల కేంద్రాల్లో వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చేటు చేసుకోకుండా బీర్కూర్ ఎస్సై రాజశేఖర్, నస్రుల్లాబాద్ ఏఎస్సై వెంకట్రావు ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బంద్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. హిందూ సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ ఆలయం నుంచి శివాజీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మహమ్మద్ నగర్‌లో పోలీసుల బందోబస్తు



నిజాంసాగర్‌లో ర్యాలీ

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



నిజాంసాగర్(జుక్కల్): హైదరాబాద్- బోధన్ 765–డి రోడ్డు విస్తరణ పనుల్లో ఆస్తులు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లో హైవే అథారిటీ రీజనల్ అధికారి కృష్ణ ప్రసాద్‌ను జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పాండురంగ నాయక్ బాధితుల తరపున కలిశారు. రోడ్డు విస్తరణ కారణంగా ఎదురవుతున్న సమస్యల గురించి ప్రస్తావించారు. వ్యాపారులు జక్సానీ శ్రీనివాస్ గుప్తా, దుబ్బ వసంత్‌కుమార్, నాగరాజు, దర్జీ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరం



లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్ గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి హన్న జోనస్ తెలిపారు. గ్రామానికి చెందిన 38 గేదెలు, 2 ఎడ్లు, 4 ఆవులకు గాలికుంటు టీకాలు వేసినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకుడు రవి, గోపాల మిత్రలు ఎజాస్, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని డీఈవో రాజు అన్నారు. బుధవారం కల్వరాల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో వసతులను చూసి ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందించారు. బోధనా సామగ్రి, పాఠశాల అభివృద్ధి విషయంలో అభినందించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మెరుగుపరచడానికి పాటిస్తున్న మెలకువలను తెలుసుకున్నారు. ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి నీలం లింగం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పును మాత్రమే వాడాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి, పొల్కంపేట, లింగంపేట గ్రామాల్లో అయోడైజ్డ్ ఉప్పు వాడకంపై ఇంటింటికి వెళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది బుధవారం అవగాహన కల్పించినట్లు పీహెచ్‌సీ వైద్యులు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. మహిళలు వంటింట్లో తప్పనిసరిగా అయోడైజ్డ్ ఉప్పు మాత్రమే వాడాలని సూచించారు. ఇతర ఉప్పు వాడకం వల్ల పిల్లల్లో పెరుగుదల లోపించి, గొంతుభాగంలో గ్రంధి ఉబ్బడం, జ్ఞాపకశక్తి తగ్గడం, పెద్దవారిలో మరుగుజ్జుతనం, గర్భధారణ సమస్యలు, గర్భస్రావం, పిల్లలు అనారోగ్యంగా పుట్టడం, తదితర సమస్యలు వస్తాయన్నారు.

పదవులు శాశ్వతం కాదు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): పదవులు, రాజకీయాలు ఎవ్వరికి శాశ్వతం కాదని మానవతాదృక్పథంతో నాయకులు చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలుస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బుధవారం మాగి గేటు వద్ద మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామకిష్టయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే పాల్గొన్నారు. రామకిష్టయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు చేసిన మేలు ఎల్లప్పుడు గుర్తుంటుందన్నారు. రెండు మండలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, నాయకులు మనోజ్‌పటేల్, గుర్రపు శ్రీనివాస్‌పటేల్, రాంరెడ్డి, రమేష్ యాదవ్, ఆకాష్, బాల్‌సాయిలు, సవాయిసింగ్ ఉన్నారు.

స్టేడియంలో గుంతల పూడ్చివేత



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పడిన గుంతలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పూడ్చివేయించారు. జేసీబీతో పనులను బుధవారం ప్రారంభించారు. మైదానంలో గుంతలతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో గుంతలను పూడ్చి చదును చేయించినట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులు చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్‌లు శివకృష్ణమూర్తి, వంశీ తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



కామారెడ్డి రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో ఎల్లయ్య సూచించారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాతరాజంపేట ఎంపీయూపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు అశోక్, సీఆర్‌పీ చిరంజీవి, ఉపాధ్యాయులు రవి, సంతోష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటమరణారెడ్డి బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాల రుణాలు, బకాయిలపై, డ్వాక్రా సంఘాల సమస్యలపై పీడీ శ్రీధర్‌రెడ్డితో చర్చించారు. సంక్షేమ పథకాల అమలుపై నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు సూచించారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



నాగిరెడ్డిపేట: గ్రామాలలో స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. బుధవారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాగునీటిలో ప్రతి రోజు బ్లీచింగ్ పౌడర్ కలపాలని, క్లోరినేషన్ టెస్టు చేయాలని అన్నారు. ఎంపీడీవో ప్రభాకర్‌చారి ఉన్నారు.